సాక్షి విశాఖపట్నం

సోమవారం, 7, అక్టోబర్, 2024



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు 8లో

రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ప్రయాణికుల బ్యాగులను అణువణువూ పరిశీలించారు.



సండే సందడి

దసరా సెలవులు కావడంతో ఆదివారం పర్యాటకులు, నగరవాసులు సాగరతీరానికి చేరుకుని ఎంజాయ్ చేశారు. 8లో



బిగిస్తున్న ఉక్కు పిడికిలి

ఉక్కు పిడికిలి బిగుస్తోంది. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కార్మికవర్గం కదం తొక్కుతోంది. 8లో

న్యూస్‌రీల్

ధైర్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష తులసితో పూజ నిర్వహించారు. సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన తదితర పూజలు చేశారు. సోమవారం సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనమివ్వనున్నారని, కలువ పూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనవరిలో బీచ్ ఫెస్టివల్, విశాఖ ఉత్సవ్



మంత్రి దుర్గేష్‌కు మొక్క అందిస్తున్న జిల్లా పర్యాటకాధికారి

సాక్షి, విశాఖపట్నం : నగరంలో టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. విశాఖ పర్యటనలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి ఆదివారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి(డీటీవో) జ్ఞానవేణి మంత్రికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. జిల్లా పరిధిలో చేపట్టిన టూరిజం ప్రాజెక్టుల స్థితిగతుల గురించి మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ జనవరిలో బీచ్ ఫెస్టివల్‌తో పాటు విశాఖ ఉత్సవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్నవరంలో నిర్మితమవుతున్న ఒబెరాయ్ 5 స్టార్ హోటల్ ప్రాజెక్టు గురించి మంత్రి ఆరా తీశారు. యాత్రి నివాస్ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఏపీటీడీసీ అధికారులను ఆదేశించారు. ఎంవీ మా షిప్ అభివృద్ధికి అవసరమైన అనుమతులపై దృష్టి సారించాలన్నారు.

కి'లేడి' వలలో మరో యువకుడు


కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మద్రిపాలెం: ఎన్ఆర్ఐ యువకుడికి వలపు వల వేసిన కి'లేడి'పై ఐదో పట్టణ పోలీస్ స్టేషన్(కంచరపాలెం)లో మరో బాధితుడు ఫిర్యాదు చేశాడు. మురళీనగర్ ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన కొరుప్రోలు జాయ్ జెమీమా షీలానగర్‌కు చెందిన ఎన్ఆర్ఐ యువకుడిని వేధింపులకు గురిచేసిన సంగతి తెలిసిందే. ఆమె నుంచి తప్పించుకున్న ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించడంతో జెమీమాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్ఆర్ఐ యువకుడి లాగే.. అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ యువకుడు ఆమె వలపు వలలో చిక్కుకున్నాడు. అతడితో పరిచయం పెంచుకున్న జెమీమా పలుమార్లు నగదు తీసుకుంది. మాయమాటలు చెప్పి వివాహం కూడా చేసుకుంది. ఆ తర్వాత ఆమె జాడ లేకపోవడంతో ఆ యువకుడు మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జెమీమా అతన్ని వేధింపులకు గురిచేస్తూ అందినకాడికి దోచుకుంది. నగదు ఇవ్వలేని పక్షంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అతని భార్యకు చూపిస్తానని బెదిరించేది. దీంతో ఆమె అడిగినంత నగదును ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ యువకుడి ఘటన వెలుగులోకి రావడంతో బాధితుడు కంచరపాలెం పోలీసులను ఆశ్రయించాడు. అతని నుంచి పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

హనీట్రాప్ కేసులో ఆధారాలు సేకరిస్తున్నాం

అల్లిపురం: హనీట్రాప్ కేసులో ఆధారాలు సేకరిస్తున్నామని సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీమా వెనుక ఒక ముఠా ఉందని, వారే ఆమెకు శిక్షణ ఇచ్చారన్నారు. ధనవంతులను ఎలా ట్రాప్ చేయాలి? మత్తు ఎలా ప్రయోగించాలి? వీడియోలు తీసి ఎలా బ్లాక్‌మెయిల్ చేయాలి? వంటి అంశాలపై తర్ఫీదునిచ్చారన్నారు. జెమీమా బాధితులు తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది ఉన్నారన్నారు. ఆధారాలన్నీ సేకరిస్తున్నామని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని కమిషనర్ తెలిపారు.

షీప్ షీప్ హుర్రే



800లకు పైగా పొట్టేళ్లు, మేకల అమ్మకాలు

రూ. **1.75** కోట్ల వ్యాపారం

'నాటు'నాటు.. అదిరేటట్టు

తగరపువలస సంతకు దసరా శోభ

తగరపువలస : తగరపువలసలో ఆదివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో పొట్టేళ్లు, మేకలకు భలే గిరాకీ ఏర్పడింది. దసరా రోజు ఆయుధ పూజకు పొట్టేళ్లను బలి ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. పండక్కి ఇంకా ఐదు రోజులే ఉండటంతో జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు ఆదివారం తగరపువలసలో జరిగిన పొట్టేళ్ల సంతబాట పట్టారు. తమ ప్రతిష్టకు చిహ్నంగా కొమ్ములు తిరిగిన పొట్టేళ్లను ఎంచుకుని ధరలకు వెరవకుండా కొనుగోలు చేశారు. రైతులు కూడా తాము ఏడాది పొడవునా సాకిన మేకలు, గొర్రెల కొమ్ములకు రంగుల తాళ్లు, పూసలు, రంగులతో అలంకరించారు. సంతకు తీసుకువచ్చే ముందే మరింత బలిష్టంగా కనిపించడానికి వాటికి ప్రతిరోజూ ఇచ్చే మోతాదు కంటే కాస్త ఎక్కువగా బియ్యం, తవుడు, తెలగపిండి, ఉలవలు తినిపించి గంజి, నీళ్లు తాగించడంతో నిగనిగలాడాయి. భీమిలి, భోగాపురం మండల రైతులే కాకుండా విజయనగరం జిల్లాలోని పొట్టేళ్లు, మేకల పెంపకానికి ప్రసిద్ధి చెందిన డెంకాడ మండలానికి చెందిన బంగార్రాజుపేట, కొండ్రాజుపేట గ్రామాల వ్యాపారులు వందల సంఖ్యలో పొట్టేళ్లను, మేకలను తరలించారు. ఆదివారం మార్కెట్‌లో 800లకు పైగా పొట్టేళ్లు, మేకలు చేతులు మారి రూ.1.75 కోట్ల వ్యాపారం జరిగినట్టు అంచనా. సగటున కిలో మాంసం రూ.వెయ్యికు గిట్టుబాటు అవుతుందని వ్యాపారులు, కొనుగోలుదారులు తెలిపారు.



పొట్టేళ్లతో పోటీపడిన నాటుకోళ్లు

సంతలో పొట్టేళ్ల ధరలతో నాటుకోళ్లు పోటీ పడ్డాయి. పుంజులు కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు అమ్ముడుపోయాయి. ఇదే సమయంలో కొందరు మధ్యవర్తులు గిరిరాజా కోళ్లను నాటుకోళ్లు పేరు చెప్పి అంటగట్టారు. చాలా వరకు కోళ్లకు తెగుళ్లు ఉండటంతో వాటికి వాడవలసిన నాటు మందుల పేర్లు చెప్పి మరీ విక్రయించారు. మొత్తం మీద దసరా పుణ్యమాని వేలాది కోళ్లు సంతలో, బయట అమ్ముడుపోయాయి.

ప్రతి సంతకు వెళ్తాను



నేను ఉత్తరాంధ్రలో జరిగే ప్రతి సంతకు వెళ్తాను. సీజన్ బట్టి ఆయా సంతలలో కోళ్లు, మేకలు, పొట్టేళ్లు విక్రయిస్తాను. ఆదివారం జరిగిన సంతలో కోళ్లకే గిరాకీ కనిపించింది. పొట్టేళ్లు, మేకల ధరలు అందుబాటులో ఉన్నాయి.

-పాసిల కృష్ణ, లక్కిడాం, విజయనగరం

మేకలు, పొట్టేళ్లకు గిరాకీ



దసరా సందర్భంగా పొట్టేళ్లకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. ఒక్కోసారి పొట్టేళ్లు దొరకని పరిస్థితి. కొందరు డెంకాడ మండలంలోని బంగార్రాజుపేట, కొండ్రాజుపేట గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేస్తారు.

– కె.ఎ.ఎస్.ఎస్.రెడ్డి, విశ్రాంత వీఆర్వో, మూలకుద్దు, భీమిలి

వేకువజాము నుంచే సంత బాట



స్టీల్‌ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డు, పోర్ట్, రైల్వే, నేవీ, ఎన్ఏడీ, ఎఫ్‌సీఐ, ఆర్టీసీ, ముఠా, ఆటో కార్మికులు, ఉద్యోగులు వాహనాలతో ఆదివారం వేకువజామునే తగరపువలస సంతకు చేరుకున్నారు. ఇదే మంచి భేరం అన్నట్టు బొబ్బిలి, బుడుమూరు, రాజాం, గజపతినగరం, కొత్తవలస, సాలూరు, మానాపురం, పార్వతీపురం, కందివలస గెడ్డ, కాశీపట్నం, కిలారి, నవరవిల్లి, బాపట్ల, గుంటూరు, వినుకొండ, గార, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన మారుబేరగాళ్లు, రైతులు తరలివచ్చి కొనుగోలు చేశారు.

సిఫార్సుల సర్వేయర్లు

- ఏసీబీ కేసులు ఉన్న వారికే జీవీఎంసీలో పోస్టింగ్‌లు
- కూటమి ప్రజా ప్రతినిధులతో బేరసారాలు
- పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు
- ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఇంకా చేరని సర్వేయర్లు

మహారాణిపేట: సర్వేయర్ల బదిలీల ప్రక్రియపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారదర్శకతకు దూరంగా బదిలీలు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తీవ్ర ఆరోపణలు, ఏసీబీ కేసుల ఉన్న వారికి జీవీఎంసీలో పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిడి, సిఫార్సుల మేరకు ఈ బదిలీలు జరిగాయని.. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. కొంత మందికి ప్రాధాన్యం లేని చోట్ల పోస్టింగ్ రావడంతో వారు ఇంకా విధుల్లో చేరకపోవడం గమనార్హం.

ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 118 మంది సర్వేయర్లకు బదిలీలు జరిగాయి. కీలకమైన పెందుర్తి, ఆనందపురం, భీమిలి, గాజువాక, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి తదితర మండలాల్లో సర్వేయర్ల పోస్టులు ఎక్కడా లేని ధర పలికాయి. ఇక్కడ పోస్టింగ్ దక్కించుకోవడానికి సర్వేయర్లు పోటీ పడ్డారు. ఆయా ఎమ్మెల్యేల సిఫార్సులు ఉంటే గాని పోస్టింగ్ రావడం లేదని తెలిసిన సర్వేయర్లు.. వారితో బేరసారాలకు దిగారు. కాగా.. జీవీఎంసీ పరిధిలోని ఏడు సర్వేయర్ల పోస్టుల్లో.. నాలుగు పోస్టింగుల మీద విమర్శలు వస్తున్నాయి. ఆరోపణలు, ఏసీబీ కేసులు ఉన్న వారికి ఇక్కడ పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. అలాగే పెందుర్తి సర్వేయర్ నియామకం మీద కూడా ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ పోస్టింగులన్నీ అనుకున్న ప్రకారం జరిగిపోయాయి. అలాగే వారు విధుల్లో కూడా చేరిపోయారు. ఇదిలా ఉండగా కొంత మందికి ప్రాధాన్యం లేని పోస్టింగులు వచ్చాయి. అంటే అక్కడ డబ్బులు పెద్దగా రావు అన్నమాట! అలాంటి చోట్ల సర్వేయర్లు ఇంకా విధుల్లో చేరలేదు. ఇంకా రిలీవ్ చేయలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. బదిలీలు జరిగి 13 రోజులు దాటుతున్నా ఇంకా విధుల్లో చేర లేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వేయర్ ఇంకా విధుల్లో చేరలేద ని చెప్పి వెనక్కి పంపుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ రవినాథ్ తిల్హారి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

దూరాన్ని బట్టి ఇసుక ధరలు

- రవాణా, ఆపరేషనల్ చార్జీలు చెల్లించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: దూరం బట్టి ఇసుక ధరలు మారుతుంటాయని.. రవాణా, ఆపరేషన్ చార్జీలు చెల్లించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ దేశాలకు అనుగుణంగా ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని.. పాలసీకి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ప్రజల అవసరాల మేరకు రోజుకు 3,000 టన్నుల ఇసుకను పక్క జిల్లాల నుంచి తెప్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉచిత ఇసుక విధానం, ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ, రీచ్‌లు, ఇతర అంశాలపై కలెక్టరేట్ వీసీ హాలులో సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 20 నుంచి అన్ని సచివాలయాలు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇప్పటి వరకు 442 బుకింగ్‌లు జరిగాయన్నారు. 357 బుకింగ్‌లకు 7,000 టన్నుల ఇసుక సరఫరా చేశామని వివరించారు. బల్క్ ఆర్డర్లు 103 జరగ్గా సాంకేతిక కారణాలతో ఇవ్వలేదని.. వారందరికీ రెండు, మూడు రోజుల్లో ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సవరించిన పాలసీ ప్రకారం ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేసి వినియోగదారుడి ఇంటి వద్దకే ఇసుక అందిస్తుందని, రెండో పద్ధతిలో వినియోగదారుడు సొంత వాహనం ఏర్పాటు చేసుకుంటే రవాణా చార్జీలు మినహాయింపు ఉంటుందన్నారు. 24/7 ఆన్‌లైన్ బుకింగ్ (https://sand.ap.gov.in) విధానం అందుబాటులోకి వస్తుందని, ఈ మేరకు అన్ని స్థాయిల్లో సిబ్బందికి, అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నానికి 190 కిమీ దూరం ఉండగా.. 20 మెట్రిక్ టన్నుల ఇసుక తెచ్చుకునేందుకు రూ.19,000 అవుతుందని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దూరాన్ని బట్టి ధరలు మారుతాయని.. ఈ విషయాన్ని గమనించాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే రెండేళ్ల వరకు జైలు

ఇసుక అక్రమంగా తరలించినా, నిల్వ ఉంచినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు. వీటిపై నిత్యం నిఘా ఉంచేందుకు రెవెన్యూ, పోలీస్, మైన్స్ అండ్ జియాలజీ, పంచాయతీ రాజ్ విభాగాల అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి రెండు తప్పులకు జరిమానా ఉంటుందని, మూడో సారి తప్పు చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, టోల్ ఫ్రీ నంబర్ 0891 2590100 ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. అలాగే తన చాంబర్‌లో టాస్క్ ఫోర్స్ కమిటీతో సమావేశమయ్యారు. ఉచిత ఇసుక విధానాన్ని పర్యవేక్షించాలని.. అవకతవకలు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలని కమిటీని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి పూట జరిగే కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, జేసీ మయూర్ అశోక్

77 కేసుల్లో 71 మంది అరెస్ట్

- రూ.86,24,850 విలువైన సొత్తు స్వాధీనం
- 272 మొబైల్ ఫోన్ల రికవరీ
- సెప్టెంబర్ క్రైం రిపోర్ట్ వెల్లడించిన సీపీ



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు





బాధితులకు వస్తువులు అందజేస్తున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: రికవరీ అయిన సొత్తును బాధితులకు అందజేసేందుకు నూతన విధానానికి శ్రీకారం చుట్టామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. 'చోరీ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి.. దొంగతనానికి గురైన వస్తువులు రికవరీ చేసేవాళ్లం. వాటిని బాధితుడు తిరిగి పొందాలంటే కోర్టులో పిటిషన్ వేయాలి. కోర్టు ఆర్డర్ తీసుకుని వచ్చి.. అందులో కొంత సొమ్ము డిపాజిట్ చేస్తే గానీ రికవరీ అయిన సొత్తు బాధితులకు ఇచ్చేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి చెప్పి మేమే కోర్టుకు సమాచారం ఇస్తున్నాం. రికవరీ అయిన సొత్తును బాధితులకు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టాం.' అని సీపీ వివరించారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు.

సెప్టెంబర్ క్రైం రికవరీ రూ.86,24,850

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెప్టెంబర్‌లో 105 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. కమిషనర్, క్రైం డీసీపీ పర్యవేక్షణలో సాంకేతిక బృందంతో దర్యాప్తు చేపట్టి పలు కేసులను ఛేదించారు. ఒక రాబరీ కేసు, 4 పగటి పూట దొంగతనాలు, 13 రాత్రి పూట ఇంటి దొంగతనాలు, 9 చైన్ స్నాచింగ్ కేసులు, ఒక ఆటో దొంగతనం, 23 మోటార్ సైకిల్ దొంగతనాలు, 26 ఇతర దొంగతనాలు కలిపి 77 కేసుల్లో 71 మందిని అరెస్ట్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.45,44,850 లక్షల విలువ గల 1.2 కిలోల బంగారు వస్తువులు, 943.43 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1,54,840 నగదు, 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, ఒక కారు, ల్యాప్‌టాప్, 30 మెట్రిక్ టన్నుల కోల్, 30 కిలోల రాగి తీగ, రూ.40,80,000 లక్షల విలువ గల 272 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు.



ఆటోను బాధితుడికి అందజేస్తున్న సీపీ బాగ్చి

అవగాహన కల్పిస్తున్నాం

దొంగతనాల నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు క్రైం పోలీసులు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు. ఈ మేరకు 178 నేర అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగర వ్యాప్తంగా 335 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, కాలనీ అసోసియేషన్లు, దుకాణాలు, సముదాయాల వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాల నియంత్రణతో పాటు నేర పరిశోధనలో పోలీసులకు సహకరించిన వారవుతారని సీపీ అన్నారు. ఇప్పటి వరకు రూ.5.21 కోట్ల విలువ గల 3,479 మొబైల్ ఫోన్ల రికవరీ చేశామన్నారు. అనంతరం బాధితులకు మోటార్ సైకిళ్లు, ఆటో, బంగారు వస్తువులు, మొబైల్ ఫోన్లను ఆయన అందజేశారు. నిందితులను అరెస్ట్ చేసి.. పోయిన సొత్తును రికవరీ చేసిన సిబ్బందిని అభినందించారు.

యువతులను కాపాడిన లైఫ్ గార్డ్స్



యువతులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువతులు కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన పది మంది యువతీయువకులు ఆదివారం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇ. హర్షిత, శ్రీజ, వైష్ణవి కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ చందు, అమ్మోరు, సతీష్ గమనించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. యువతులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో విస్తృత తనిఖీలు



రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు చేస్తున్న తూర్పు ఏసీపీ లక్ష్మణరావు, సీఐ విజయకుమార్

సీతమ్మధార: రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. తూర్పు ఏసీపీ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీఐ ఎస్.విజయ కుమార్ పర్యవేక్షణలో డాగ్ స్క్వాడ్, డ్రగ్స్ టెస్టింగ్ కిట్లతో స్టేషన్ ఆవరణ, అవుట్ గేటు, బస్టాప్ వద్ద అణువణువూ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేసి.. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించారు. ద్విచక్ర వాహనాలు తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్ఐ ప్రమీలా, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగే కదా.. ఏమవుతుందిలే!

'డియర్ స్టూడెంట్స్.. ర్యాగింగ్ అనేది శృతి మించకూడదు. ఇకపై ఎవరూ ర్యాగింగ్ చేయకూడదు. ఒకవేళ ఎవరైనా పొరపాటున చేసినా.. చూసీచూడనట్లు సర్దుకుపోవాలి కదా.. మీకు మరీ అంత ఇబ్బందిగా అనిపిస్తే.. మా దృష్టికి తీసుకురండి.. అంతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించండి. లేదంటే.. తెలుసుకదా..' ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ కారణంగా.. బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న బాధిత విద్యార్థినులతో ప్రొఫెసర్లు చెప్పిన మాటలివీ.

ఒక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ భూతం కోరలు చాస్తుంటే నిలువరించేందుకు జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి బాధిత విద్యార్థులకే హెచ్చరికలు జారీ చేయడం ఏయూకే చెల్లింది.



- సర్దుకుపోవాలంటూ విద్యార్థులకు కొందరు ప్రొఫెసర్ల క్లాస్
- 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్న కమిటీ
- చదువుపై దృష్టి సారించలేక పోతున్నామని విద్యార్థుల ఆవేదన

సాక్షి, విశాఖపట్నం : గత కొన్నేళ్లుగా ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా నిలిచిన ఏయూలో ర్యాగింగ్ భూతం మళ్లీ పేట్రేగుతుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఏయూలోని ఆర్కిటెక్చర్ విభాగ సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తూ ర్యాగింగ్‌కు పాల్పడ్డమే ఇందుకు నిదర్శనం. రోజురోజుకు సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ పర్వం శ్రుతిమించుతుండటంతో జూనియర్ విద్యార్థులు మానసికంగా కుంగిపోయారు. డ్యాన్స్ చెయ్యండి.. అని అడగడం.. డ్యాన్స్ రాదని జూనియర్లు చెబితే.. వెళ్లి.. అబ్బాయిల దగ్గర నేర్చుకొని డ్యాన్స్ చెయ్యండి అంటూ వారిని చిత్రహింసలకు గురిచేశారు. కేవలం హాస్టల్‌లోనే కాకుండా క్లాస్ రూమ్‌లలోనూ ర్యాగింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ల ఆగడాలను తట్టుకోలేక తల్లిదండ్రులు, సన్నిహితులకు ఫోన్లు చేసి.. తమ మానసిక ఆందోళన గురించి చెప్పుకోవడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది.

తూతూ మంత్రంగా విచారణ

ర్యాగింగ్ వ్యవహారం బయటికి రావడంతో ఏయూ అధికారులు హడావుడి చేశారు. పలుమార్లు ప్రొఫెసర్లు, వీసీ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని అధికారులు 'సాక్షి'లో కథనం ప్రచురితమవ్వడంతో స్పందించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. డ్యాన్స్‌ల వీడియోలు ఎవరి ఫోన్ నుంచి ఫార్వర్డ్ అయ్యాయి.. ఎవరెవరికి ఫార్వర్డ్ చేశారు.. ఇలా.. ఏ కోణంలోనూ విచారణ చేపట్టకుండా బాధిత విద్యార్థుల నుంచి సమాచారం తీసుకొని.. గుర్తించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేశారు. అయితే కేవలం ఆర్కిటెక్చర్ విభాగంలో మాత్రమే బయటికి వచ్చినా.. మిగిలిన విభాగాల్లోనూ ఇటీవల ర్యాగింగ్ జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా ఏయూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

బయటికి పొక్కకూడదు.. తస్మాత్ జాగ్రత్త

ఏయూలో ర్యాగింగ్ నిరోధానికి మూడంచెల కమిటీ పనిచేస్తోందా..? నిద్ర నటిస్తోందో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ ర్యాగింగ్ ఘటన బయటకు రావడంతో కొందరు అధికారులు విద్యార్థులతో సమావేశమై.. ర్యాగింగ్ శృతి మించకూడదు. స్నేహపూర్వకంగా ఉండాలనీ.. ఒకవేళ ఇబ్బందిగా అనిపిస్తే.. నేరుగా తమ దృష్టికి తీసుకురావాలే తప్ప బయటకు వెళ్లే పద్ధతిగా ఉండదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఏయూ అధికార యంత్రాంగం వైఖరితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామనీ.. హాస్టల్ వద్ద చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారంపై సీరియస్‌గా ఉండాలనీ.. భవిష్యత్తులో మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భైక్ రేసర్లపై కేసులు



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్– రుషికొండ రోడ్‌లో బైక్ రేసింగ్‌లు జరుగుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో పీఎంపాలెం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఐదుగురు రేసర్లను అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం ఇక్కడ కొందరు యువకులు రేసింగ్ పేరుతో అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా, పెద్ద పెద్ద శబ్దాలతో విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో స్థానికులు కొందరు పోలీసులు సమాచారమందించారు. దీంతో వై. తనోజ్, రిచర్డ్ సన్ లెవిస్, ఎం.వాసు, షేక్ ఆర్మన్, వి. జ్ఞానేశ్వర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి తల్లి దండ్రులను పోలీసు స్టేషన్‌కి పిలిపించి విశాఖ నార్త్ జోన్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్. కాంతారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు జి. ప్రసాద్, భాస్కరరావు తదితరులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రేసర్లపై కేసు నమోదు చేసి వారి లైసెన్స్‌లు మూడు నెలలు రద్దు చేయడానికి ఎంవీ అధికారులకు సిఫార్స్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

బిడ్డకు జన్మనిచ్చిన మానసికరోగి



తల్లీబిడ్డను టీఎస్సార్ వుమెన్ షెల్టర్ నిర్వాహకులకు అప్పగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

సీతమ్మధార: ఏయూటీడీ చొరవతో ఒడిశాకు చెందిన జాస్మిన్ ఓ చిన్నారికి జన్మనిచ్చింది. రైల్వేస్టేషన్‌లో చేసిన రెస్క్యూ ఆపరేషన్‌లో పట్టుబడిన జాస్మిన్ భషిల్ల(35)కు మతిస్థిమితం లేకపోవడంతోపాటు గర్భవతి కావడంతో జూన్ 8న ఏయూటీడీ నిర్వాహకులు ఆశీలమెట్టలోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌లో ఆశ్రయమిచ్చి ఆమె బాగోగులు చూసుకున్నారు. అనంతరం ఆగస్టు 20న వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా సెప్టెంబర్ 19న వైద్యులు శస్త్రచికిత్స చేశారని సంస్థ ప్రతినిధి జ్యోతిర్మయి తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, హెచ్‌వోడీ డాక్టర్ ఉషారాణి, డాక్టర్లు సంధ్యదేవి, సత్యకళ, హర్షిత, స్టాఫ్ నర్సు సూర్యకుమారి సమక్షంలో ఏయూటీడీ సిబ్బంది లీలావతి, ప్రశాంత్, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయికి తల్లీబిడ్డను ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ అందరినీ అభినందించినట్లు షెల్టర్ సెక్రటరీ ప్రగడ వాసు తెలిపారు.

రాజరాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి



రాజ రాజేశ్వరి దేవి అవతారంలో..

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు ఆదివారం రాజరాజేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ సామూహిక కన్యల పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దంగేటి మంగామణి శ్రీ వేంకటేశ్వర గానామృతం భక్తులను అలరించింది. సోమవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి తెలిపారు.



కన్యల పూజలో పాల్గొన్న యువతులు

బిగిస్తున్న ఉక్కు పిడికిలి



కూర్మన్నపాలెం నుంచి వడ్లపూడి వరకు మానవహారంగా ఏర్పడిన కార్మికులు

- కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కదం తొక్కుతున్న కార్మికవర్గం
- మానవహారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు



మానవహారంలో పాల్గొన్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



జాతీయ రహదారిపై రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు

అగనంపూడి: ఉక్కు పిడికిలి బిగిస్తోంది. రోజురోజుకూ ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కార్మికవర్గం కదం తొక్కుతుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్మికులు మానవహారంలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం వైఖరిని ఖండించారు. పెద్ద ఎత్తున పోలీసులు, కేంద్ర బలగాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. రాస్తారోకోలు, ధర్నాలు జరగకుండా వారించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఉక్కు ఉద్యమకారుడు బిషాయ్ కాళికాదేవి అవతారంలో పాల్గొని ఉద్యమకారులను ఉత్సాహ పరిచాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 87వ వార్డు పార్టీ నాయకులు మానవహారంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

అగనంపూడి కూడలిలో...

అగనంపూడి కూడలిలో నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. తరువాత మానవహారం చేపట్టారు. పోరాట కమిటీ నాయకులు జి.బోసుబాబు, విళ్లా రామ్మోహన్‌కుమార్, పెదిరెడ్ల హరనాథ్, నీలకంఠం, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యం కావాలి



లెనిన్ శత జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

డాబాగార్డెన్స్: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని జేఎన్‌యూ ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అయిన లెనిన్ మరణించి వందేళ్లు అవుతున్నా ఆయన చూపిన మార్గాన్ని నేడు ప్రపంచ కార్మిక వర్గానికి ఆయుధంగా చేసుకుందన్నారు. ఈ ఉద్యమాలు మరింత ఉధృతం చేసేందుకు కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని ఆయన సూచించారు. లెనిన్ శత జయంతి సభ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం ఏర్పడి ప్రపంచ యుద్ధాలు వచ్చాయన్నారు. సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కె.లోకనాథం, ఎం.కృష్ణమూర్తి, వీఎస్ పద్మనాభరాజు, బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, ఈశ్వరమ్మ, బి.జగన్, కెఎం.శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.





చేపలు దండిగా.. బోట్లు నిండుగా..





మహారాణిపేట: కొమ్ముకోనాం, ట్యూనా చేపలతో ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఈ చేపలు దండిగా చిక్కుతున్నాయి. ఈ చేపలు ఐదు నుంచి 20 కిలోల వరకు బరువు ఉన్నాయి. ముఖ్యంగా కొమ్ముకోనాం చేపలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. దీంతో మంచి ధర పలుకుతోంది. ఈ చేపలను కేరళ వాసులు ప్రీతిగా స్వీకరిస్తారు. ఒక్క వేటలో ఎక్కువ చేపలు చిక్కడంతో మత్స్యకారుడు వాసుపల్లి సత్తిబాబు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి అధిక సంఖ్యలో చేపలు దొరికాయన్నారు. ట్యూనా చేపలు కూడా అధికంగా లభించడంతో హార్బర్‌లో సంతోషకర వాతావరణం నెలకొంది. ఈ చేపలను స్థానికంగా విక్రయించడంతో పాటు ఎగుమతికి సిద్ధం చేశారు.

మునిగిపోయిన టగ్‌ల తొలగింపు





విడి భాగాలను బయటకు తీసుకున్న కార్మికుడు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన ట్రాలర్లు, వెసెల్స్, టగ్‌లను వెలికితీసే కార్యక్రమానికి పోర్టు ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. 1971 నుంచి 1990 మధ్య కాలంలో దాదాపు 20 ట్రాలర్లు, వెసెల్స్, టగ్‌లు మునిగిపోయాయి. దీని వల్ల హార్బర్‌లోని పలు జెట్టీల్లో బోట్లు, ఇతర పడవల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వీటిని తొలగించాలని ఏపీ మరపడవల సంఘం ఎప్పటి నుంచో కోరుతోంది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. పోర్టు కూడా వీటిని తొలగించాలని సంబంధిత ట్రాలర్ల యజమానులకు నోటీసులు జారీ చేసింది. అయినా ఎవరూ స్పందించక పోవడంతో పోర్టు కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల మేరకు మునిగిపోయిన ట్రాలర్లు, వెసెల్స్‌ను సముద్రంలో కార్మికులు కట్ చేసి విడి భాగాలను బయటకు తీస్తున్నారు. ఇందుకోసం క్రేన్లు, ఇతర పరికరాలను వినియోగిస్తున్నారు. కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని పోర్టు అధికారులు తెలిపారు.



క్రేన్ ద్వారా విడి భాగాలు బయటకు తీస్తున్న దృశ్యం

36 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆరిలోవ: ఆరిలోవకు చెందిన ఓ వ్యక్తి పీడీఎస్ బియ్యం మిల్లుకు తరలించడానికి సిద్ధం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలివీ.. ఆరిలోవ కాలనీ ఎస్‌కేఎంఎల్ నగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రేషన్ బియ్యం మూటలతో వేరే ప్రాంతంలో రైస్ మిల్లుకు తరలించడానికి వరద ప్రశాంత్ సిద్ధమయ్యాడు. ఈ బియ్యం బస్తాలను వాహనంలో ఎక్కిస్తుండగా స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ కృష్ణ, సిబ్బందితో అక్కడకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. ఆ బియ్యం బస్తాలలో కొన్ని రేషన్ సంచులతో కూడిన మూటలు కూడా ఉన్నాయి. దీంతో బియ్యం బస్తాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి నుంచి సుమారు 36 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ బియ్యాన్ని పౌర సరఫరా విభాగం అధికారులకు అప్పగిస్తామని ఎస్ఐ వెల్లడించారు.

రీ సర్వేలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం

ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్

బీచ్‌రోడ్డు: గత ప్రభుత్వ హయాంలో రీసర్వే నిర్వహించడంలో ఎంతో మంది గ్రామ సర్వేయర్లు సమస్యలు ఎదుర్కొన్నారని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చిరంజీవిరావు అన్నారు. సిరిపురం బాలల ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒత్తిడితో చేసిన రీ సర్వేలో ఎన్నో ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రీ సర్వే రద్దు చేసినప్పటికీ.. మళ్లీ రీ సర్వే ప్రాజెక్ట్ ప్రారంభించనుందన్నారు. గతంలో జరిగిన ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సర్వేయర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.వి.రామకృష్ణ, ఈ.రామకష్ణ, ఎన్.సుధాకర్, ఎం.రాజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.అప్పలస్వామి, పొన్ను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్.కె బీచ్‌లో జన సందోహం

సండే సందడి

బీచ్‌రోడ్డు: కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులు సేదతీరేందుకు ఆదివారం సాగరతీరానికి క్యూ కట్టారు. తరలివచ్చిన పర్యాటకులు, సందర్శకులతో ఆర్.కె.బీచ్‌లో సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో పిల్లలతో పాటు కుటుంబ పెద్దలు తీరానికి చేరుకుని ఎంజాయ్ చేశారు. మరో వైపు యువతీ యువకులు సెల్ఫీలు తీసుకుని.. చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. సందర్శకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బీచ్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. సందర్శకులు సముద్రంలో దిగకుండా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు.



